క్లుప్తంగా

వైద్య శిబిరం ఏర్పాటు

మదనాపురం: మండలంలోని నెలివిడిలో సామాజిక విజ్ఞాన కళాశాల, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌కు చెందిన బీఎస్సీ డిగ్రీ విద్యార్థినులు గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణ కార్యక్రమం ద్వారా గ్రామస్తులకు పలు అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డైట్ కౌన్సెలింగ్ సెంటర్, ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సెంటర్, కిచెన్ గార్డెనింగ్ తదితర వాటి గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కోట్ల రాములమ్మ, ఎంపీటీసీ కురుమయ్య, కేవీకే శాస్త్రవేత్త అనిత, విద్యార్థినులు రసజ్ఞ, చరణ్య, మేఘన, రచన, సుష్మ, గీత, పావని, మోహిని, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఇటుక బట్టీల వద్ద ప్రైవేట్ టీచర్ నియామకం

పాన్‌గల్: మండలంలోని అన్నారంతండా సమీపంలో ఉన్న ఇటుక బట్టీల వద్ద పనులు చేసే కూలీల పిల్లల చదువు కోసం ప్రైవేట్ టీచర్‌ను నియమించినట్లు ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. గురువారం ఇటుక బట్టీల వద్ద ఉన్న బడిఈడు పిల్లలను సీఆర్పీలతో కలిసి ఎంఈఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఇటుక బట్టీల వద్ద ఒడిశా రాష్ట్రానికి చెందిన పలువురు కూలీలు పనులు చేస్తున్నారు. పనులు చేసే కూలీల పిల్లలు చదువుకు దూరం కాకుండా ఉండేందుకు ప్రైవేట్ టీచర్‌ను నియమించి విద్యను బోధిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పిల్లల చదువుకు తల్లిదండ్రులు అంగీకరించడంతోనే ప్రైవేటు టీచర్‌ను నియమించినట్లు ఎంఈఓ పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు గోవింద్, శేఖర్, సంతోష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేత



కొత్తకోట రూరల్: మండలంలోని అమడబాకులకు చెందిన సివిల్ కాంట్రాక్టర్ కృష్ణయ్య తన సొంత డబ్బులు రూ.10వేలు ఖర్చు చేసి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపించారు. ఆ క్రీడా వస్తువులను గురువారం హెచ్ఎం జమీల్ మునవర్, పీఈటీ రాంమోహన్ విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో గల పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్న కృష్ణయ్యకు విద్యార్థుల తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం శ్రీనివాసులు, భాస్కర్, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్‌బాబు, రాధిక, భారతమ్మ, ధనుంజయగౌడ్, కవిత తదితరులు ఉన్నారు.

కరపత్రాల విడుదల



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి శివారులోని శ్రీదత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయంలో జరుగనున్న మహాశివరాత్రి మహోత్సవ కార్యక్రమాల వివరాలకు సంబంధించిన కరపత్రాలను గురువారం ఆలయ నిర్వాహకులు విడుదల చేశారు. మార్చి 8న జరిగే మహాశివరాత్రి సందర్భంగా ఆలయంలో జరిగే పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో శేఖరయ్య, విశ్వనాథ్, జగదీశ్వర్, జగదీష్, అనిల్, శివ మాలధారులు ఉన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



పెబ్బేరు రూరల్: హైదరాబాద్‌లోని ఎల్బీనగర్‌లో జనవరి 31న నిర్వహించిన బ్లాక్ బెల్ట్ పోటీలలో పెబ్బేరుకు చెందిన సుమన్ కరాటే అకాడమీ విద్యార్థులు పాల్గొన్నారు. బ్లాక్‌బెల్ట్ విభాగంలో పవన్‌కుమార్, ట్వింకిల్‌రెడ్డి, చక్రధర్‌సాగర్, మోక్షిత్‌సాగర్, తస్విన్, సాయిరోహన్ బ్లాక్‌బెల్ట్‌లు సాధించారు. కలర్‌బెల్ట్ విభాగంలో మేఘన, వేదవతి, గౌతం, ధనుష్, జస్విత్, దేవాన్ష్ కలర్ బెల్ట్‌లు సాధించారని మాస్టర్ శ్రీనివాసులు తెలిపారు. గెలుపొందిన వారికి హీరో సుమన్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ మనోజ్ఞసాగరి పాల్గొన్నారు.

భజన కార్యక్రమం

పెబ్బేరు రూరల్: మండల కేంద్రంలో ఇంటింటా భజన–మనింట్లో భజన 250వ వారం సందర్భంగా అయ్యప్ప ఆలయంలో భజన చేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రెస్‌క్లబ్ నూతన అధ్యక్షుడు గొడుగు బాలవర్ధన్, ప్రధాన కార్యదర్శి పరశురాం, సీనియర్ రిపోర్టర్ బాలరాజుకు అయ్యప్ప స్వామి ఆలయంలో సన్మానం చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలను సమాజానికి తెలియజేయాలని, పెబ్బేరు మండలంలోని ప్రతి ఆలయాల్లో జరిగే పూజా కార్యక్రమాన్ని ప్రచురించాలని కోరారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట రూరల్: అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని నిర్వేన్, చర్లపల్లి, రామకృష్ణాపురం గ్రామాల్లో ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన చేస్తూ వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యేగా గెలిచి మొదటి సారి వచ్చిన ఎమ్మెల్యేకు ఆయా గ్రామాల ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారం చేపట్టిన రెండు రోజుల్లోనే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.10లక్షల ఆరోగ్యశ్రీ పథకాలను అమలు చేశామన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చి ఆరు గ్యారంటీ పథకాలను తప్పకుండా అమలు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కట్టుబడి ఉన్నారన్నారు. కాంగ్రెస్ పాలనలోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని, రేషన్‌కార్డుల పంపిణీ, పేదలకు ఇళ్ల నిర్మాణం, రుణమాఫీ వంటి వాటిపై తీవ్రంగా కసరత్తు జరుగుతుందన్నారు.

నిధుల మంజూరు నిర్లక్ష్యం

గత ప్రభుత్వంలో నిధులు మంజూరు చేయకపోవడంతో గ్రామాల అభివృద్ధి కుంటుపడిందన్నారు. కాంగ్రెస్ పాలనలో నిధులు మంజూరు చేసి గ్రామాల అభివృద్ధికి తోడ్పడతామన్నారు. సర్పంచ్‌లకు సరైన గౌరవం దక్కలేదన్నారు. త్వరలో జరుగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో అన్ని స్థానాలను కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చి 60రోజులు కూడా కాలేదని, బీఆర్ఎస్ పార్టీ తమపై విమర్శలు చేయడం సరికాదన్నారు. ఎమ్మెల్యే వెంట టీపీసీసీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రశాంత్, జిల్లా ప్రధాన కార్యదర్శులు బోయేజ్, కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు డాక్టర్ బాబు, సర్పంచ్‌లు విశ్వనాథం, శేఖర్‌రెడ్డి, శివరాజు, లత, కాంగ్రెస్ నాయకులు రావుల జితేంద్రనాథ్‌రెడ్డి, సత్యారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రావుల కర్ణాకర్‌రెడ్డి, బీచుపల్లియాదవ్, మాసన్న, గొల్లబాబు, రాములు యాదవ్, చంద్రశేఖర్‌రెడ్డి, రంగారెడ్డి, జేసీబీ రాములు, నరేందర్‌సాగర్, శివరాములు ఉన్నారు.

పాలకులం కాదు సేవకులం

మదనాపురం: మండలంలోని దంతనూరులో గురువారం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ప్రభుత్వ అధికారులు, స్థానిక నాయకులతో కలిసి రూ.20 లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఎన్ఈజీఎస్ ద్వారా చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి చేశారు. అనంతరం సర్పంచు, ఉప సర్పంచు, వార్డు సభ్యుల పదవీకాలం ముగిసిన సందర్భంగా వారిని పూలమాల, శాలువాతో సన్మానించారు. గ్రామంలోని పాఠశాలలో విద్యార్థులకు బుక్స్ పంపిణీ చేశారు. అంతకు ముందు మండల కేంద్రంలో రజక సంఘం కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రావణి, ఎంపీపీ పద్మావతి, వైస్ ఎంపీపీ యాదమ్మ, విండో ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగన్న, జగదీశ్, హనుమాన్‌రావు, రాజవర్ధన్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, తహసీల్దార్ అబ్రహం లింకన్, ఎంపీడీఓ నాగేంద్రం, ఏఈ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

హమాలీలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలి



సమ్మె నోటీసును అందజేస్తున్న కార్మికులు

కొత్తకోట రూరల్: హమాలీ కార్మికులుగా పనిచేస్తున్న పేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నిక్సన్ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం స్థానిక హమాలీ కార్మికులతో కలిసి సివిల్‌సప్లయర్స్ గోదాం అధికారి సత్యనారాయణను కలిసి ఈనెల 16 నుంచి కార్మికుల సమస్య పరిష్కారం కోసం చేపడతున్న సమ్మె నోటీసును అందజేశారు. ఈసందర్భంగా నిక్సన్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా చాలిచాలనీ కూలి డబ్బులతో పనిచేస్తున్న హమాలీ కార్మికుల గురించి ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. సివిల్‌సప్లయర్స్ గోదాంలో పనిచేసే హమాలీలకు నూతన రేట్ల ఒప్పందం చేయాలని, కార్పొరేషన్ ఎలక్ట్రీషియన్ స్టోర్ హమాలీలను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. 50ఏళ్ల నిండిన ప్రతి కార్మికుడికి రూ.10వేల పెన్షన్ ఇవ్వాలని, 11ఏళ్ల క్రితం మరణించిన హమాలీ కార్మికులు తిమ్మన్న, శివలకు నేటికి నష్టపరిహారం ఇవ్వలేదని వాపోయారు. కార్యక్రమంలో జి.రాములు, బాలయ్య, శివన్న, వెంకటయ్య, రాములు, రాము తదితరులు ఉన్నారు.

దాతల సహకారంతో విద్యార్థులకు అల్పాహారం



విద్యార్థులకు అల్పాహారం వడ్డిస్తున్న ఎంపీటీసీ, దాత

పాన్‌గల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు దాతల సహకారంతో అల్పాహారం అందిస్తున్నట్లు ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, పాఠశాల జీహెచ్ఎం విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం దాతల సహకారంతో ఏర్పాటు చేసిన అల్పాహారాన్ని ఎంపీటీసీ హైమావతి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రానికి చెందిన 2000–01 సంవత్సరం పూర్వ విద్యార్థులు రాంబాబు, కృష్ణారెడ్డి అల్పాహారం వితరణకు రూ.22 వేలు అందజేసినట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా దాతలను పాఠశాల తరఫున సన్మానించారు. కార్యక్రమంలో దాత రాంబాబు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

రేవంత్ పాలన బాగుంది



మాట్లాడుతున్న చిన్నారెడ్డి

వనపర్తిటౌన్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గాల పరిధి ప్రజల ఆశలు త్వరలోనే తీర్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర రైల్వే మంత్రిని శుక్రవారం స్వయంగా కలవనున్నారని ఏఐసీసీ కార్యదర్శి చిన్నారెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గద్వాల– డోర్నకల్ రైలు మార్గానికి నిధులు కేటాయించిన వెంటనే పనులు ప్రారంభించనున్నారని, నిధుల కేటాయింపే ఆలస్యమన్నారు. రాయచూర్ – మాచర్ల, గద్వాల – మాచర్ల రైల్వేలైన్ల ప్రతిపాదనలుండగా, రాయచూర్ –గద్వాల రైలు నడుస్తున్నప్పటికీ 14 ఏళ్లుగా మాచర్ల లైన్ పెండింగ్‌లో పడిందన్నారు. గద్వాల– డోర్నకల్ రైల్వేలైన్ గద్వాల, కడుకుంట్ల, వనపర్తి, గోపాల్‌పేట, నాగర్‌కర్నూల్ మీదుగా కల్వకుర్తి వరకు ఉందని, ఇందుకు రూ. 5,030 కోట్లతో ప్రాజెక్టు నిధులు ఖర్చు కానున్నాయని అంచనా వేశారని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గద్వాల – మాచర్ల రైల్వే విషయంలో రాష్ట్ర వాటా ఇవ్వకపోవడంతో ఆ రైలు మార్గం ప్రతిపాదన పెండింగ్‌లో పడిందని అసహనం వ్యక్తం చేశారు. తాజాగా గద్వాల – డోర్నకల్ రైల్వే ప్రతిపాదనూ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని, గద్వాల నుంచి కల్వకుర్తి వరకు కామన్ లైన్ ఒకటే ఉంటుందని, కల్వకుర్తి నుంచి కిందకు మాచర్ల వైపు మరొక లైన్ నిర్మాణానికి నిధులు కేటాయింపు చేసేలా సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నాలు ముమ్మరం చేశారన్నారు. దీంతో గద్వాల– డోర్నరల్, గద్వాల– మాచర్ల లైన్‌కల నెరవేరుతుందని వెల్లడించారు. సమావేశంలో రాజేంద్రప్రసాద్, సయ్యద్ అక్బర్, అనిస్, ఖమర్ మియ్యా, శంకర్‌ప్రసాద్, సత్యారెడ్డి, ధనలక్ష్మి, విజయవర్ధన్‌రెడ్డి, రాములు, కృష్ణ, పరశురాం, కిరణ్, బాబా, జానకీరాములు, భాస్కర్, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని ఏఐసీసీ కార్యదర్శి చిన్నారెడ్డి అన్నారు. మండలంలోని బుద్ధారం గ్రామానికి కాంగ్రెస్ కార్యకర్త శ్రీహరి మరణించడంతో పార్టీ నుంచి వచ్చిన రూ.2లక్షల ఇన్సూరెన్స్ చెక్కును బాధిత కుటుంబానికి అందించారు

సర్పంచ్‌ల పనితీరుతోనే గ్రామాల అభివృద్ధి



ఆరేపల్లిలో సర్పంచ్, వార్డుసభ్యులను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

ఆత్మకూర్: గ్రామాల అభివృద్ధితోనే దేశ ప్రగతి ఆధారపడి ఉందని, సర్పంచ్‌ల అత్యుత్తమ పనితీరుతోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, వైస్‌ఎంపీపీ కోటేష్, విండో అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం ఆరేపల్లి, బాలకిష్టాపూర్‌లో సర్పంచ్‌లు అనసూయ యుగంధర్‌రెడ్డి, తుకారాంనాయక్‌తో పాటు ఉపసర్పంచ్‌లను, వార్డుసభ్యులను పూలమాలలు, శాలువాలతో సత్కరించి వారి సేవలను కొనియాడారు.

పాన్‌గల్: ఐదేళ్ల పాటు గ్రామాభివృద్ధికి గ్రామస్తులు అందించిన సహకారం మరువలేనిదని అన్నారం సర్పంచ్ రాములు, ఉప సర్పంచ్ ప్రవీణ్‌కుమార్ రెడ్డి అన్నారు. గురువారం పంచాయతీ భవనంలో గ్రామస్తులు సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్మికులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని ఎంపీపీఓ కార్యాలయం సమావేశ మందిరంలో సర్పంచ్‌లకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంపీడీఓ విజయ్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి మల్లయ్య, పంచాయతీరాజ్ ఏఈ కబీర్‌దాస్, ఎంపీఓ రాజుతో కలిసి సర్పంచులను శాలువాలు, పూలమాలలతో సన్మానించి, మెమొంటోలను అందించారు. ఈ సందర్భ ంగా వారు మాట్లాడుతూ దేశంలో గ్రామ పంచాయతీలకు ప్రత్యేక హక్కులు, విధులు ఉంటాయన్నారు.



అన్నారంలో..



ఖిల్లాఘనపురంలో..

బ్యాంకులతో అనేక ప్రయోజనాలు

గోపాల్‌పేట: బ్యాంకులు కల్పించే అవకాశాలను అందిపుచ్చుకుని వినియోగదారులు ఆర్థికంగా నిలబడాలని నాగర్‌కర్నూల్ ఏపీజీవీబీ రీజినల్ మేనేజర్ వారణాసి రంజిత్ అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలో ఇన్సూరెన్స్, సామాజిక భద్రత పథకాలు, రుణ సదుపాయాలపై అవగాహన కల్పించారు. వినియోగదారులు తీసుకునే అప్పులను సకాలంలో తిరిగి బ్యాంకులకు చెల్లిస్తే వారికి కలిగే లాభాలను వివరించారు. ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ నుంచి వచ్చిన రూ.20 లక్షల చెక్కును బాధిత కుటుంబానికి అందించారు. ఏపీజీవీబీ గోపాల్‌పేట బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్‌యాదవ్, నోడల్‌ఆఫీసర్ సీవీ రమేష్, ఫీల్డ్ ఆఫీసర్ సందీప్ ఉన్నారు.

‘మూడోసారి మోదీనే ప్రధానమంత్రి’

వనపర్తి టౌన్: ప్రధానమంత్రిగా మూడోసారి మోదీనే ప్రజలు ఎన్నుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారాయణ కోరారు. ఈ మేరకు పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము ఆధ్వర్యంలో గావ్ చలో అభియాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రతి ఇంటికి చేరుతున్నాయని, దేశాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్న మోదీ సర్కారు మళ్లీ అధికారంలోకి వచ్చేలా ప్రజలు ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో శ్రీశైలం, ప్రభాకర్, రామన్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, ప్రవీణ్, రాజశేఖర్ గౌడ్, మోహన్ సాగర్, విష్ణువర్ధన్‌రెడ్డి, గోర్ల బాబురావు, కొమ్ము సామెల్, రాములు, రఘు తదిరులు పాల్గొన్నారు.

యాదవ కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన



పెబ్బేరు రూరల్: మండలంలోని కొత్తసూగూరులో యాదవ కమ్యూనిటీ భవనానికి గురువారం జెడ్పీటీసీ పద్మ, సర్పంచ్ జూదం వెంకటేష్‌కు శంకుస్థాపన చేశారు. జెడ్పీటీసీ ఎస్‌డీఎఫ్ నిధుల ద్వారా రూ.5 లక్షలు కేటాయించారు. ఈ కార్యక్రమంలో పెద్దింటి వెంకటేష్, హనుమన్న, చంద్రయ్య, బీచుపల్లి, బీసన్న, రవికుమార్, యాదవులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెబ్బేరు రూరల్: వనపర్తి పట్టణంలోని కేడీఆర్ నగర్‌కు చెందిన ఓ వ్యక్తి ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి పట్టణంలోని కేడీఆర్ నగర్‌కు చెందిన వెంకటయ్య (55) బుధవారం రాత్రి ఒంటిపై కిరోసిన్ పోసుకోని నిప్పంటించుకోవడంతో ఇంట్లో మంటలు రావడంతో చుట్టు పక్క వారు గమనించి 100కు ఫోను చేసి సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకొని ఫైర్ సిబ్బందికి ఫోన్ చేయడంతో వారు మంటలు ఆర్పి జిల్లా ఆస్పత్రికి బాధితుడిని ఆస్పత్రికి తరలించారు. బాధితుడికి మెరుగైన చికిత్స కోసం మహబూబ్‌నగర్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు భార్య శోభ ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి

మదనాపురం: మండలంలోని నెలివిడి కాలనీ సమీపంలోని 188 సర్వే నంబర్ ఉన్న ప్రభుత్వ భూమిని గుర్తించి ప్రజల భవిష్యత్ అవసరాలకు ఉపయోగపడే విధంగా హద్దులు ఏర్పాటు చేయాలని గురువారం తహసీల్దార్ అబ్రహంలింకన్‌కు కాలనీవాసులు వినతిపత్రం సమర్పించారు. త్వరలో సర్వే నిర్వహిస్తామని హామీ ఇచ్చారు.

ప్రత్యేక అధికారుల పాలన

కొత్తకోట రూరల్: ఫిబ్రవరి 1న సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారులతో పాలన కొనసాగించనుంది. కొత్తకోట మండలంలోని 22గ్రామాలకు నేటి నుంచి ప్రత్యేక అధికారులతో పాలన కొనసాగనుంది.

కొత్తకోట ప్రత్యేక అధికారుల వివరాలు

గ్రామాలు	ప్రత్యేక అధికారి
చర్లపల్లి, పాలెం, వడ్డెవాట	షేక్ మున్నా (ఏఓ)
అమడబాకుల, బూత్‌కూర్, నాటవెళ్ల పెద్దతండా	ఎస్‌కే షబ్బీర్ హుస్సేన్ (ఏఈ)
కానాయపల్లి, సత్యహళ్ల	అఖిల్ (ఏఈ)
కనిమెట్ట, రామనంతాపూర్	ఆకాష్ (ఏఈ)
అప్పరాల, రామకృష్ణాపూర్	శివకుమార్ (డీటీ)
మిరాసిపల్లి, ముమ్మళ్లపల్లి	కృష్ణయ్య (ఎంఈఓ)
నాచారంపేట, పామాపూర్, విలియంకొండ	రవీందర్‌బాబు (ఎంపీఓ)
నాటవెళ్ల, నిర్వేన్, రాయిణిపేట	బాల్‌రెడ్డి (తహసీల్దార్)
సంకిరెడ్డిపల్లి, ఈదులబాయితండా	డాక్టర్ విజయ్‌కుమార్ (వెటర్నరీ)
పెద్దమందడి మండలంలో..	
అల్వాల, అమ్మపల్లి	హరీష్ (ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ)
గట్లఖానాపూర్, మంగంపల్లి, స్కూల్‌తండా	రాజేష్ (పంచాయితీరాజ్ ఏఈ)
మద్దిగట్ల, మోజర్ల	శ్రీధర్‌బాబు (డీటీ)
చిన్నమందడి, ముందరితండా, వీరాయిపల్లి	జయశంకర్ (ఎంఈఓ)
అనకాయిపల్లితండా, బుగ్గపల్లితండా, జత్‌పల్లి, మనిగిళ్ల	అఫ్జల్ (ఎంపీడీఓ)
బలిజపల్లి, చీకురుచెట్టుతండా, జంగమాయపల్లి, పామిరెడ్డిపల్లి	శ్రీధర్‌రెడ్డి (ఎంపీఓ)
చిలకటోనిపల్లి, పెద్దమందడి, వెల్టూర్	కిషన్‌నాయక్ (తహసీల్దార్)
దొడగుంటపల్లి	డాక్టర్ స్వాతి (వెటర్నరీ)
పాన్‌గల్ మండలంలో..	
చింతకుంట, దొండాయిపల్లి, మల్లాయిపల్లి	వెంకటేష్ (ఏఈ)
కదిరెపాడు, మాధరావుపల్లి, పాన్‌గల్, శాగాపూర్	లక్ష్మీకుమార్(ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్)
చిక్కేపల్లి, శాగాపూర్‌తండా, తెల్లరాళ్లపల్లి, తెల్లరాళ్లపల్లితండా	విద్యాసాగర్‌రెడ్డి (పీఆర్ ఏఈ)
అన్నారం, దావాజిపల్లి, వెంగళాయిపల్లి	శ్యామ్ (పశువైద్యాధికారి)
బహదూర్‌గూడెం, బండపల్లి, జమ్మాపూర్	ఎండీ.సాజీద్ రహమాన్(ఏఓ)
బుసిరెడ్డిపల్లి, కేతేపల్లి, మంగళ్లపల్లి	లక్ష్మణ్‌నాయక్(ఎంఈఓ)
అన్నారంతండా, గోప్లాపూర్, కిష్టాపూర్‌తండా, రేమద్దుల	రఘురాములు(ఇన్‌చార్జీ ఎంపీడీఓ)
దావాత్‌ఖాన్‌పల్లి, కొత్తపేట, మాందాపూర్, రాయినిపల్లి	అశోక్‌కుమార్ (ఇన్‌చార్జీ తహసీల్దార్)
ఖిల్లాఘనపురం మండలంలో..	
దొంతికుంటతండా, కోతులకుంటతండా, రుక్కన్నపల్లి	వెంకటేశ్వర్లు (ఏఈ, ఇరిగేషన్)
ఈముదంబండతండా, కర్నెతండా, సల్కెలాపురం, వెనికితండా	మల్లయ్య (ఏఓ)
ఆగారం, అంతాయపల్లి, కమాలోద్దీన్‌పూర్, తిర్మలాయపల్లి	డి. పరమేశ్వర్ (డీటీ)
అప్పారెడ్డిపల్లి, మామిడిమాడ, పర్వతాపురం	ఎన్. కబీర్‌దాస్ (ఏఈ పీఆర్)
అల్లమాయిపల్లి, ఈర్లతండా, మల్కిమియాన్‌పల్లి, రోడ్డుమీదితండా	ఉషారాణి (ఎంఈఓ)
మల్కాపూర్, మానాజీపేట, షాపురం	ఎస్. విజయ్‌కుమార్ (ఎంపీడీఓ)
సోళీపురం, సూరాయిపల్లి, ఉప్పరిపల్లి	ఎ. రాజు (ఎంపీఓ)
గట్టుకాడిపల్లి, ఖిల్లాఘనపురం, వెంకటాంపల్లి	పాండు నాయక్ (తహసీల్దార్)

రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయం

ఆత్మకూర్: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించబోతుందని, రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కావడం ఖాయమని టీపీసీసీ రాష్ట్ర కల్లుగీత డిపార్ట్‌మెంట్ చైర్మన్ కేశం నాగరాజుగౌడ్ అన్నారు. రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్‌న్యాయ్ యాత్రకు సంఘీభావంగా సీడబ్ల్యూసీ ప్రత్యే ఆహ్వానితుడు వంశీచందర్‌రెడ్డి న్యాయ్‌యాత్ర చేపట్టారు. ఈ యాత్ర మక్తల్ నియోజకవర్గంలోని కృష్ణ నుంచి ప్రారంభమై శుక్రవారం సాయంత్రం 4 గంటలకు అమరచింత మీదుగా ఆత్మకూర్ చేరుకుంటుందని అన్నారు. ఆత్మకూర్‌లో జరిగే సభకు రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడుగురు ఎమ్మెల్యేలు హాజరవుతున్నారని వెల్లడించారు. ఆ సభకు సంబంధించి గురువారం రాత్రి ఆత్మకూర్‌లోని గాంధీచౌక్‌లో ఏర్పాట్లను పర్యవేక్షించి మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ లోక్‌సభ ఎన్నికల్లో ఓటమిపాలు కావడం ఖాయమన్నారు. కాంగ్రెస్‌తోనే సుపరిపాలన సాధ్యమని దేశ ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు అయ్యూబ్‌ఖాన్, రహమతుల్లా, పరమేష్, శ్రీను, సాయిరాఘవ, రఫీక్, గంగ పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి



ప్రతిజ్ఞ చేయిస్తున్న జెండర్ స్పెషలిస్టులు

పాన్‌గల్: గ్రామాల్లో బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు మహిళా సమాఖ్య సభ్యులు కృషి చేయాలని మహిళా శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్టులు శ్రీవాణి, సలోమీ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కేంద్రంలో బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, మహిళలు సామాజికంగా ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారంపై సమాఖ్య సభ్యులు, వీఓఏలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనిచేసే ప్రదేశాల్లో లైంగిక వేధింపులు, కుటుంబ కలహాలు, మహిళ హెల్ప్‌లైన్ నంబర్ 181 గురించి వివరించారు. మహిళల సమస్యల పరిష్కారానికి సాధికారత కేంద్రం అన్ని వేళల్లో అందుబాటులో ఉంటుందన్నారు. బాల్య వివాహాలు, బాలకార్మిక నిర్మూలన, మహిళల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు.

ఆర్థికసాయం అందజేత



పాన్‌గల్: మండలంలోని కేతేపల్లికి చెందిన ఈశ్వర్ కుటుంబానికి మిత్రబృందం గురువారం రాత్రి రూ.58 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈశ్వర్ తండ్రి చిన్నయ్య జనవరిలో గుండెపోటుతో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని అదుకునేందుకు ఈశ్వర్‌తో పాటు 1994–95 సంవత్సరంలో కలిసి చదువుకున్న పదో తరగతి పూర్వ విద్యార్థులు రూ.58 వేలు అందజేశారు. కార్యక్రమంలో కాకం ఆంజనేయులు, బీరయ్య, శ్రీకాంత్, రాంగోపాల్‌వర్మ, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

స్వీపర్ కాదు.. టీచర్



ఫొటోలో పాఠశాల ఆవరణ శుభ్రం చేస్తు కనిపిస్తున్నది స్వీపర్ అనుకుంటే పొరపాటే. పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న స్కావెంజర్లను గత ప్రభుత్వం తొలగించడంతో విధిలేని పరిస్థితుల్లో సీనియర్ ఉపాధ్యాయురాలు ప్రమీల నిత్యం పరిసరాలను శుభ్రం చేస్తున్నారు. అమరచింత మండల కేంద్రంలోని బాలికల ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న ప్రమీల టీచర్ తమకు స్వీపర్ కేటాయించాలని అధికారులను కోరుకుంటున్నారు. – అమరచింత